# మధురవాణి

-డాక్టర్ పొన్నాల యాదగిరి

ఆఫీసు నుంచి అలసి వచ్చిన ప్రశాంత్ వాలు కుర్చీలో వేరగిలబడ్డాడు. నెమ్మదిగా బూట్లు విప్పసాగాడు. ఆఫీసులో పని చేసే శ్రమ ఒక ఎత్తు, పబ్లిక్ బస్సులో చోటు చేసుకొని రావడం ఇంకొక ఎత్తు. ఒళ్ళంతా హూనం అయిపోతుంది. పక్కనే ఉన్న ట్రాన్సిస్టరు తీసుకొని ఏదో స్టేషను పెట్టాడు. చక్కని మురళీగానం వస్తోంది. అలలు అలలుగా తేలివస్తున్న ఆ మధుర సంగీతానికి ప్రశాంత్ మనస్సు కొంచెం తేలిక పడింది. అతని ఆలోచనలు గత స్మృతులను వెతకసాగాయి.

మంచి కంఠం గల వ్యక్తి అన్నా మధురమైన ధ్వని, వీనులకు సొంపైన సంగీత మన్నా ప్రశాంత్‌కు మొదటి నుంచీ ఎంతో ఇష్టం. ఎం.ఏ. పూర్తి చేసి అతను పురాతత్వ శాఖలో ఆఫీసరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అతను మారుమూల గ్రామాల్లోకి, అడవుల్లోకి, కొండల్లోకి, పచ్చిక బయల్లో మందంగా పాములా మెలికలు తిరిగి పారు నదు లున్న చోటికి - ఇలా ఎన్నో స్థలాలకు సర్వేకు వెళ్ళవలసి వచ్చేది. అక్కడ ప్రకృతి సహజమైన వింత దృశ్యాలను చూస్తూ, వివిధ ధ్వనులను వింటూ ప్రశాంత్ తనివితీరా ఆనందించే వాడు.


ఆ సంవత్సరం అతను సర్వే చేసి తవ్వకాలు తీయడానికి గోదావరి ప్రాంతానికి బయలుదేరాడు. మెయిన్ రోడ్డు మీద జీపు అతి వేగంగా పరుగెడుతోంది. రోడ్డు ఒరిపిడికి జీపు టైర్లు ఏవో వింత ధ్వనులను సృష్టిస్తున్నాయి. ఆ శబ్దం వింటూ కాంపుకి వచ్చే దాకా ప్రశాంత్ దానిలోనే లీనమయ్యాడు.

సర్వే కొరకు ప్రొద్దున్నే కూలీని తీసుకొని అడవికి బయలుదేరాడు ప్రశాంత్. ఆ ఊరి నుంచి గోదావరి గట్టుకి అడవి ప్రాంతం దాటి వెళ్ళాలి. అడవిలో ఎండి రాలిపోయిన టేకు, ఇతర చెట్లు, ఆకులు భూమిని పూర్తిగా కప్పేశాయి. ప్రశాంత్ బూట్లు వాటి మీద పడగానే అవి విరిగి వింత ధ్వని చేస్తున్నాయి. అడుగులకు అనుగుణంగా ఆ శబ్దాలు చెలరేగుతున్నాయి. కొద్ది దూరం పోయిన తర్వాత కూలీ వెనుతిరిగి ఆగవలసిందిగా సైగ చేశాడు. ఫర్లాంగు దూరంలో ఎండు టాకుల ధ్వని వస్తున్న వైపు చూపాడు. ప్రశాంత్ నిశ్చేష్టు డయ్యాడు. సుమారు ఇరవై జింకలు ఒక దాని వెనుక ఇంకొకటి పరుగెడుతున్నాయి. ఒక్కొక్కటీ కనీసం పది అడుగుల దూరం దూకుతున్నాయి. దానితో ఎండిన ఆకులు అదో రకమైన ధ్వనిని కలగ జేస్తున్నాయి. ఇంతలో ఒక మగ జింక ఆగి ప్రశాంత్ నిలుచున్న వైపు తీక్షణంగా చూడసాగింది. లేళ్ళన్నీ సురక్షితంగా దాటి పోయే వరకు ఆగి, ఆ తర్వాత వాటిని అనుసరించింది. దాని సునిశిత దృష్టికి ప్రశాంత్ అబ్బురపడ్డాడు. అంత చక్కని దృశ్యాన్ని తిలకించి అతను ఆ రోజు ఎంతో ఆనందించాడు.

చీకటి పడిన వెంటనే ఆ ఊరు నిర్జీవమై పోతుంది. అలసి వచ్చిన గ్రామీణులు ఉన్న దేదో తిని దీపం వెలిగించుకునే అవసరం లేకుండానే నిద్రలోకి ఒరిగిపోతారు. ఊరు చివర్లో మామిడి తోపులో డేరాలు వేసుకొని ఉన్న ప్రశాంత్‌కి మాత్రం అప్పు డప్పుడు కుక్కల అరుపులు వినిపిస్తుంటాయి. ఆ సమయంలో అతనికి మిత్రుడు, సన్నిహితుడు అన్నీ ఒక్క ట్రాన్సిస్టరే. రేడియో సిలోన్ ప్రోగ్రామ్స్ వింటూంటాడు. చక్కని పాటలు, మృదుమధురమైన అనౌన్సర్స్ కంఠం అతని కాలక్షేపం. ఏ మాత్రం జన సమ్మేళనం లేని ఆ నిశ్శబ్ద నిశీధిలో నెమ్మదిగా, మెత్తగా మాట్లాడుతున్న ఆ అనౌన్సర్ తన ముందర ఉన్నట్లే ఫీలయేవాడు ప్రశాంత్.

ఆ మరునటి రోజు 'పెళ్ళి చూపులు ఏర్పాటు చేశాం. వెంటనే బయల్దేరి రావలసింది', అంటూ తండ్రి దగ్గర నుంచి టెలిగ్రాం వచ్చింది.

అతని మనస్సులో కలవరం బయలుదేరింది. సంపాదిస్తూ తన కాళ్ళ మీద తాను నిలబడినా, ఇంతలో పెళ్ళి చేసుకుందా మనే ఉద్దేశం అతనికి కలగ లేదు. ప్రేమ - పెళ్ళి అనే వాటి మీద నమ్మకం లేకపోయినా, పెళ్ళి చూపులు - ఆచారాలు అంటే ఒక విధమైన సిగ్గు, విసుగు.



నంతలో పశువును నిలబెట్టినట్లు పది మంది ముందూ అమ్మాయిని కూర్చోబెట్టి, కాలు మీద కాలు వేసుకొని గర్వంగా కూర్చున్న కాబోయే వరునికి ఆమె గుణగణాలు వర్ణిస్తుంటే అతనికి చిరాకు.

ఇష్టం లేకపోయినా, పెద్దల మనస్సు నొప్పించలేక ప్రశాంత్. పెళ్ళి చూపులకు నిర్దేశించిన గదిలోకి వచ్చి కూర్చున్నాడు. పక్కనే బాల్య స్నేహితుడు రవి కూర్చున్నాడు. ఇరు పక్కలా అతనికి కావల్సినవా ళ్ళున్నారు. అమ్మాయి ఎలా ఉంటుందో, అమ్మాయి కంఠం ఎలా ఉంటుందో - అని ఊహించుకోసాగాడు. ఎన్నో రూపాలు అతని కళ్ళ ముందర తిరుగుతున్నాయి. అన్ని రూపాలను అవతలికి తోసి, అతను ఊహించుకొన్న సిలోన్ రేడియో అనౌన్సర్ రూపమే స్పష్టంగా కనిపిస్తోంది. తనని పలకరించి నవ్వుతున్నట్లు ఫీలయ్యాడు ప్రశాంత్.

ఇంతలో ముత్తయిదువులు అమ్మాయిని గదిలోకి తీసుకువచ్చారు. ప్రశాంత్ చూపు ఆమె మీద పడగానే అతను సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయాడు. ఇన్ని రోజులుగా తనకి కనిపించి, ఊరించిన అనౌన్సరు రూపం ఆమెతో కలసిపోయింది. చక్కని రూపం కోరుకున్న తన మన సెరిగి కాబోలు, భగవంతుడు ఈ అమ్మాయిని చూసేందుకు అవకాశం కలిగించాడు - అని మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

"అలా చూస్తావేం ? ఏమైనా అడుగు" అని రవి నెమ్మదిగా చెవిలో ఊదే సరికి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చాడు ప్రశాంత్.

"అమ్మాయి పే రేమి టన్నారు ?" అంటూ సంభాషణలోకి దింపాడు రవి.

"వీణా వాణి" అని అమ్మాయి తండ్రి సమాధానం.

ప్రశాంత్ మనస్సు ఉప్పొంగిపోయింది. మంచి శ్రావ్యమైన కంఠం అంటే వీళ్ళకు కూడా ఇష్టం కాబోలు అనుకొన్నాడు.

ప్రశాంత్ పక్కకు తిరిగే సరికి తండ్రి అతని వైపు చూసి, మృదువుగా నవ్వాడు. "నీ అభిప్రాయ మేమిటి ?" అని కళ్ళ తోనే అడిగాడు.

ప్రశాంత్ తన ఇష్టాన్ని తెలుపడానికి "అంత మీ ఇష్టం" అని స్నేహితుడు రవితో లేచాడు.

మంచి ముహూర్తానికి నెల లోపునే పెళ్ళి జరిపించారు పెద్దలు. మొదటి రాత్రి వీణా వాణి గదిలోకి అడుగు పెట్టింది. అంత వరకు అతను ఆమెతో మాట్లాడ లేదు. ఆమెను మాట్లాడించ లేదు. ఆదరంగా ఆమెని దగ్గరకు తీసుకొని, నెమ్మదిగా మంచం మీద కూర్చోబెట్టాడు.

"రాత్రి పదకొండు అవుతోంది కదూ ! కాంపులో ఈ టైముకి రేడియో వింటూ, చుక్కలను లెక్క పెడుతూ ఉంటాను" అని మాటల్లోకి దింపాడు ప్రశాంత్.

"మీకు పాట లంటే చాలా ఇష్టమా ?" అని అమాయకంగా వీణా వాణి ప్రశ్నించింది.

ప్రశాంత్‌కి ఒక్కసారి మిన్ను విరిగి మీద పడినట్లు అయింది. మధురకంఠ స్వర మున్న యువతిని భార్యగా పొందాలని ఆశించినందుకు, వీణావాణి 'మధురవాణి' అని ఊహించుకొన్నందుకు ఇది శాప మేమో అర్థం కాలేదు. కరుకుగా మగ గొంతు కంటే మోటుగా, ఏదో బావిలో నుంచి వస్తున్న వింత ధ్వనిలా ఉన్న వీణావాణి కంఠం విని అతను నివ్వెరపోయాడు. అంత చక్కని రూపానికి, ఇంతటి కర్ణకఠోరమైన ధ్వని ప్రసాదించిన దేవున్ని తలచి అతనికి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

*** *** ***

గది లోపల ఏవో పాత్రలు కింద పడినట్లు ఎవ్వతినో రెండు తగిలించినట్లు శబ్దాలు వినిపించాయి.

"అమ్మా" అంటూ రఘు ఏడుపు వినిపించింది.

ప్రశాంత్ త్వరగా లేచి లోపలికి వెళ్ళాడు.

"ఈ వెధవతో నాకు తల బద్దలవుతోంది. పెట్టిన వస్తువును పెట్టిన చోట ఉంచడు. ప్రతి వస్తువునూ తలకిందులు చేసేదాకా ఊరుకోడు" అని వీణావాణి దండకం చదువుతూ కింద పడిన వస్తువులను సర్దుతోంది.

రెండేళ్ళ రఘు ఏడుస్తూ బిక్కి బిక్కుమని తల్లి వైపు చూస్తున్నాడు.

"పిల్లల మనస్తత్వమే అది ! వస్తువులను పిల్లల చేతికి అందకుండా మనం జాగ్రత్త పడాలి" అని అందా మనుకొని ఆ మాటలను నోటిలోనే మింగేశాడు ప్రశాంత్.

ఏద్దైనా మంచి మాట చెబితే దానికి వ్యతిరేకంగా వాదిస్తుంది. ఆమె గట్టిగా మాట్లాడి నప్పుడు గొంతు ఇంకా చెడిపోతుంది. అది ప్రశాంత్ భరించలేడు. కనీసం సాంత్వన వచనాలు చెప్పక భర్త తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె ఇంకా గట్టిగా అరుస్తుంది. అలాగే గత మూడు సంవత్సరాలుగా వాళ్ళ కాపురం జరిగిపోతోంది. ఆ కాలంలో అతను ఆమెతో ఎన్నిసార్లు మాట్లాడాడో కచ్చితంగా లెక్కగట్టవచ్చు. ఆమె మాత్రం, అతను 'మిత భాషి' అని కొన్నిసార్లు సమాధానపడినా, నిర్లక్ష్యం చేస్తున్నా డన్న భావన కలిగినప్పుడు అరిచి, అరిచి వాగుడు మనిషిలా తయారైంది.

ఏడుస్తున్న రఘుని ఒళ్ళోకి తీసుకొని ఇవతలికి వచ్చి, చాక్లెట్లు చేతికి అందించాడు ప్రశాంత్. ఏడుపు అప్పుడే మరిచి పోయి, గల గల నవ్వుకొంటూ బయటికి పరుగెత్తాడు రఘు. అప్పుడే నేర్చుకొంటున్న మాటలను ఎంతో ముద్దుగా అంటాడు రఘు. అలా వింటూ కూర్చోవడం సరదా ప్రశాంత్‌కు. కనీసం వీణావాణి కంఠం తన కొడుక్కి రానందుకు ఎంతో సంతోషించాడు ప్రశాంత్.

పెళ్ళి అయిన తర్వాతే రూపానికీ, ధ్వనికీ సామాన్యంగా పొంతన ఉండదని ప్రశాంత్ తెలుసుకున్నాడు. పొట్టిగా, బలహీనంగా ఉన్న వాళ్ళకి సాధారణంగా కంఠం హెచ్చు స్థాయిలో ఉంటుంది. తమ ఉనికిని గుర్తించరనే భావనతో కాబోలు వాళ్ళు ఇంకా గట్టిగా మాట్లాడుతారు. కొందరు పొడుగ్గా, దృఢంగా ఉన్నా వారు మాట్లాడితే రెండో వ్యక్తికి అసలు వినిపించదు. కాకి, కోకిల దాదాపు ఒక రూపంలో ఉన్నా - రెండింటి ధ్వనులూ వేరు. కోకిల శబ్దానికి 'గాన'మని కవులు పాటలు కడితే, కాకి శబ్దానికి 'గోల' అని కసరి కొడతారు. సృష్టిలో ఉన్న ఈ తారతమ్యాలను ఎవ్వరూ మార్చలేరని ప్రశాంత్ మనస్సును ఊరడించుకొని, భార్యను దగ్గరకి తీసుకోవాలని

## కలువ గాథ

శ్రీ కృష్ణుని కన్నది దేవకి అయినా, పెంచిందీ, ముద్దూ ముచ్చటా అనుభవించిందీ యశోద. కృష్ణుడు తన బిడ్డడు కాడన్న విషయం ఎప్పటికో కాని యశోదకు తెలిసిరాలేదు. హాలండ్ దేశస్థుల పని ఇప్పు డలాగే అయింది. రకరకాల రంగులలో కనువిందైన పూలను పూసే కలువ మొక్కలను [టులిప్] ప్రాణప్రదంగా చూసుకుంటారు. అవి తమ గడ్డమీద మొలిచిన గొప్ప మొక్కలని మురిసిపోతుంటారు. అయితే ఇటీవల పరిశోధకులు ఉన్నవాళ్ళు ఊరుకోకుండా దాని ఆది తేల్చి హాలండ్ దేశీయుల అంతు చూశారు. వారి పరిశోధనల ప్రకారం 16వ శతాబ్దంలో ఎప్పుడో ఎవరో ఈ మొక్కల్ని టర్కీ నుంచి యూరప్‌లో ప్రవేశపెట్టారట. అచిరకాలంలోనే ఇవి యూరప్ అంతా వ్యాపించినా, హాలండ్ ప్రజలు మాత్రం వీటిని ప్రాణాధికంగా చూసుకోసాగారట. ఆ అనుబంధం బలీయమైపోయి అవి వారి సొంతం అనుకునేంతవరకు వెళ్ళిందట.

-కె. ఆర్. కె. మోహన్

శైలకుమార్
సీరియల్
వరుడు కావలెను
త్వరలో ప్రారంభం

ఎంత ప్రయత్నించినా, ఆమె మాట వినగానే అతని మనను పారిపోయి, ఇంతకు ముందు ఏర్పరచుకొన్న అనౌన్సర్ రూపాన్నే శరణు పొందుతోంది.

వీణావాణి కాఫీ కప్పును టేబిల్ మీద ఉంచి "ఇవ్వాళ డాక్టర్ సుధాకర్ గారి ఇంటికి కాఫీకి వెళ్లాలన్నారు, జ్ఞాపకం ఉంది కదూ!" అని.కాస్త నెమ్మదిగా ప్రశ్నించింది.

అతను నిజంగానే మరిచిపోయాడు - ఆలోచనల్లో పడి అంతవరకూ. జవాబు కోసం ఎదురు చూసి- "త్వరగా తయారవుతే బయలు దేరవచ్చు, నేను రఘుని రాధమ్మగారి దగ్గర వదిలి వస్తాను" అని ఈ సారి అతని జవాబుకు ఎదురు చూడకుండానే వెళ్ళింది.

ప్రశాంత్‌కి ఆమె మీద ఎంతో జాలి కలిగింది. కొన్ని సార్లు ఆమె చేసిన మంచి పనులను మెచ్చుకుందామని ఎంత ప్రయత్నించినా, మాటలు అతని గొంతు దాటి రావు. పొద్దస్తమానం ఇంట్లో చాకిరి చేస్తూ, భర్త అనురాగానికి నోచుకోని ఏ ఆడది మాత్రం చీదరించుకోదు!

* * * * * *

గుమ్మంలోనే ఎదురై స్వాగతం పలికాడు సుధాకర్. అతని వివాహమై పదిహేను రోజులవుతోంది. అనుకోకుండా వ్యవధి లేని ముహూర్తానికి స్వంత ఊరిలో అతని పెళ్ళి జరిగిపోవడం వలన మిత్రు లందందరినీ పిలవలేక పోయాడు.

లోపలకు రాగానే సుధాకర్ భార్య అరుణ నవ్వుతూ నమస్కరించింది. ఆమె చాల అందంగా ఉంది.

"మొత్తానికి డాక్టరు గారు మంచి తోడును సంపాదించారు" అని అభినందించింది వీణావాణి. సుధాకర్ దంపతులు మనస్ఫూర్తిగా నవ్వారు.

"మా వాడికి అసలు పెళ్ళి చేసుకోవాలని ఉండేది కాదు, ఎలా ఒప్పించారు" అని ఆమెని ఉద్దేశించి అడిగాడు ప్రశాంత్.

ఆమె కళ్ళల్లో క్షణంసేపు ఆందోళన ద్యోతక మయింది. పెదవులు వణికాయి.

సుధాకర్ అరుణ చేయిని ప్రేమతో, నెమ్మదిగా ఒత్తుతూ "కాఫీ తయారైయితే పట్టుకురా" అని మృదువుగా అన్నాడు.

ఆమె లేచి లోనికి వెళ్ళగానే "అరుణ మూగదిరా, ఆమెకు మాటలు రావు" అని నెమ్మదిగా అన్నాడు సుధాకర్.

ప్రశాంత్ నిజంగా నమ్మ లేకపోయాడు. రెండు చేతులా సంపాదిస్తున్న డాక్టరు, పేరు ప్రతిష్ఠలు గల ఒక వ్యక్తి, చలాకీగా జల్సాగా తిరిగే యువకుడు మూగ యువతిని పెళ్ళాడాడు అంటే నమ్ముతా రా ఎవరైనా? ఆ భావాలన్నీ వ్యక్తం చేస్తూ "ఎలా జరిగిందిరా? ఈ పెళ్ళి ఎందుకు చేసుకోవాల్సి వచ్చింది?" అని ప్రశ్నించాడు ప్రశాంత్.

తన వివాహానికి దారి తీసిన సంఘటనలను డాక్టర్ సుధాకర్ నెమరు వేసుకోసాగాడు.

డాక్టర్ సుధాకర్ హైదరాబాదుకి దగ్గర్లో ఉన్న గ్రామాల్లో ఏర్పరిచిన కుటుంబ నియంత్రణ శిబిరాలకు వచ్చాడు. రెండు రోజుల్లో కనీసం వంద వాసెక్టమీ ఆపరేషన్లు చేశాడు. మూడవ రోజు కృష్ణాపురంలో కాంపు. పంచాయతీ ఆఫీసులో ఒక గదిలో ఆపరేషన్లు చేస్తున్నారు. అప్పుడే ఆపరేషన్ చేసిన అతనికి కట్టు వేయమని అటెండరుకి చెప్పి చేతులు శుభ్రం చేసుకొంటుండగా, తలుపును ఎవరో గట్టిగా తట్టారు. తలెత్తి చూచే లోపల అటెండరు తలుపు తీసి వెలుపలికి వెళ్ళాడు. మరు క్షణంలో అతను తిరిగి వచ్చి "ఈ ఊరి పంచాయతీ ప్రెసిడెంటు ప్రమాదస్థితిలో ఉన్నాడట. మీరు వచ్చి పరీక్ష చేయాలని ప్రార్థిస్తున్నారు" అని చెప్పి తన పనిలో నిమగ్నుడైనాడు.

"మన దగ్గర అవసరమయ్యే మందులు కూడా లేవు. అయినా ఆపరేషన్లు పూర్తయినాక చూద్దాంలే" అంటూ సుధాకర్ సిగరెట్టు వెలిగించాడు.

ఈసారి తలుపుని ఇంకా గట్టిగా తట్టిన చప్పుడైంది. చీదరించు కొంటూనే తలుపు తెరిచాడు సుధాకర్.

డాక్టరుని చూడగానే పని మనిషి వెంకయ్య చేతులు జోడించి, "డాక్టరు బాబూ, మీరు మా అయ్యగారి ప్రాణాలు కాపాడాలి. తెలివి తప్పి చాలా సేపయింది. ఒళ్ళు కాలిపోతోంది. గుండె విపరీతంగా కొట్టు కుంటోంది. మా అరుణమ్మ గారు తండ్రిని చూసి బెంబేలు పడిపోతోంది" అని మొర పెట్టుకున్నాడు.

సుధాకర్ పక్కనే ఉన్న అరుణని చూశాడు. ఆమె నిజంగా భయంతో వణికిపోతున్నది. ముఖం ఆందోళనతో నిండి ఉంది. అతను అటెండరుకి సూచనలిచ్చి, వచ్చిన ఇద్దరినీ జీపులో తీసుకొని బయలుదేరాడు.

స్పృహ లేకుండా పడి ఉన్న రామయ్యని పరీక్ష చేసి, గుండె నొప్పి అని గ్రహించాడు డాక్టరు. మందుల పెట్టెలో వెతికి మందు తీశాడు. ఇంజెక్షన్ చేయడానికి వేడి నీళ్ళు కావాలని అడగ్గానే వెంకయ్య లోనికి వెళ్ళాడు.

అరుణని ఉద్దేశించి "ఇంతకు ముందెప్పుడైనా ఇలా వచ్చిందా?" అడిగాడు సుధాకర్.

తలను అడ్డంగా తిప్పింది అరుణ.

"జ్వరం ఎన్ని రోజుల్నించి వస్తోంది? మందు లేమైనా ఇప్పించార్రా?" అంటూ సుధాకర్ వాకబు చేశాడు.

అరుణ పెదవులు వణికాయి. జవాబు రాకపోయేసరికి తలెత్తి "ఎన్ని రోజులుగా ఉంది జ్వరం అంటే మాట్లాడలేవా?" అంటూ మళ్ళీ ప్రశ్నిస్తుండగా వెంకయ్య వేడి నీళ్ళతో వచ్చాడు.

"మా అమ్మాయి గారికి మాటలు రావు బాబు, ఆమె మూగది" అన్నాడు వెంకయ్య.

సుధాకర్ షాక్ తిన్నాడు. అందంగా, చదువు సంస్కారం కొట్టొచ్చినట్లు కనిపించే ఆమె రూపాన్ని చూసి, మూగ దంటే ఎవ్వరూ నమ్మరు. సానుభూతితో మళ్ళీ ఒకసారి ఆమె వైపు చూసి ఇంజక్షన్ చేయడంల్లో నిమగ్నుడైనాడు.

వెంకయ్య మాట్లాడుతూనే ఉన్నాడు. "మా అమ్మాయి గారు పుట్టుకతోనే మూగ దయ్యింది బాబూ! అయ్య గారి ప్రోత్సాహంతో మొన్ననే బి.ఏ. పాసయ్యింది. చదువు పూర్తి చేసి తిరిగి వచ్చిన అమ్మాయి పెళ్ళి గురించే అయ్య గారికి చింత పట్టుకొంది. మూగ దైనందుకు తమ తాహతకు తగ్గ వరుడు దొరకడని, తనకు సంతృప్తిని కలిగించే మనిషి లభించడని అమ్మాయి పెళ్ళికి నిరాకరించింది. ఊరిలోని స్త్రీ జనానికి కుట్టు పనులు నేర్పుతూ కాలం గడుపుతోంది. అయ్య గారికి మాత్రం ఆమెను చూసిన కొద్దీ రంపపు కోత ఎక్కువయ్యింది. ఆ బాధే ఆయనను ఇలా క్రుంగ దీసింది."

అంతలోనే రామయ్య కొంచెం కదిలాడు. అరుణ ముఖంలో ఆందోళన రేఖలు దూరం కాసాగాయి. అది గమనించి సుధాకర్ తేలిగ్గా నిట్టూర్చాడు. సుధాకర్ మనస్సులో ఆమె రూపం గాఢంగా హత్తుకు పోయింది.

"నేను ఉద్రేకంతో చేసిన పని కాదు. బాగా ఆలోచించి, నా మనస్సు మెచ్చింది చేశాను. ఆమె మూగదని అసలు నాకు జ్ఞాపకమే ఉండదు. ఒకరి నొకరు అర్థం చేసుకోవడానికి మాటలే అవసరమని నే ననుకోను. మంచి మనస్సుకి కంటి కదలికలు, చేతి స్పర్శలు ఎన్నో విషయాలు తెలుపుతాయి" అని సుధాకర్ అనగానే ప్రశాంత్ కళ్ళ ముందు నుంచి ఏదో చీకటి తెర తొలగినట్లయ్యింది.

కాఫీ తర్వాత సెలవు తీసుకొని ప్రశాంత్, వీణావాణి బయటకు వచ్చారు. మనస్సులో ఉప్పెనలా పొంగుతున్న భావాలను ఆమె ముందు ఉంచాలని అతని మనస్సు తహ తహ లాడింది.

రిక్షా ఎక్కగానే, నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోకి తీసికొని "వీణా! ఇన్ని రోజులు నేను ఎండమావుల వెంట పరుగులెత్తాను. కాని పక్కనే చల్లని సరస్సులా ఉన్న నిన్ను గుర్తించ లేకపోయాను. నన్ను క్షమించు" అన్నాడు ప్రశాంత్.

ఆమె ఒళ్ళు పులకరించింది. కంటిలో నీటి చుక్క ఒకటి తళుక్కు మంది. ఆ తన్మయత్వంలో ఆమె మాట్లాడ లేకపోయింది. ప్రశాంత్ మాటలు తెగిన ప్రవాహంలా వీస్తున్నాయి.

అతని మనస్సులో అంతకు ముందు స్థావరం ఏర్పరచుకొన్న అనౌన్సరు రూపం క్రమంగా కరిగిపోయి, అదే చోట వీణావాణి రూపం గాఢంగా నిలిచి పోయింది.

రోడ్డు మీద రిక్షా జోరుగా సాగిపోయింది. ★

## గోమేధం

**యూ**రోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీకి చెందిన వ్యవసాయ శాఖామాత్యులు ఆ మధ్య సమావేశమై తలలు పట్టుకు కూర్చున్నారు. వారికి ఆందోళన కలిగించిన విషయ మేమిటంటే పశ్చిమ యూరప్‌లో పాల ఉత్పత్తి ఎక్కువైపోయి పాల ధర పడిపోయిందట. అందువల్ల పాల దిగుబడిని పది శాతం తగ్గించి ధరలను నిలకడగా ఉంచాలని సంకల్పించారు. ఇందుకు గాను 18 నెలల కాలంలో ఇరవై లక్షల ఆవుల్ని కసాయి కత్తికి బలి ఇచ్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంటే సగటున నెలకు లక్షా పదివేల కంటే ఎక్కువే నన్న మాట. ఈ ఆవులన్నీ కూడా మన దేశంలోని సగటు ఆవు ఇచ్చే పాలకంటే పన్నెండు నుంచి ఇరవై రెట్లు ఎక్కువగా పాలను ఇస్తాయి. అందుకే అన్నారు 'లేనివాడు లేక ఏడుస్తుంటే, ఉన్నవాడు తిన్నది అరక్క అరుస్తున్నాడు' అని. ఎవరు ఎలా ఏడ్చినా మధ్యలో నిష్కారణంగా మంచి ఆవులు పాలు ఇస్తున్న పాపానికి బలి అయిపోతున్నాయి.

-కె. ఆర్. కె. మోహన్